సాక్షి
తూర్పుగోదావరి
శనివారం । 12 । జూలై । 2025



వాడపల్లి వెంకన్నకు రూ.లక్ష విరాళం

కొత్తపేట: వాడపల్లి వెంకన్న క్షేత్రంలో వకుళ మాత అన్నప్రసాద భవన నిర్మాణానికి కంకటాల సూర్యనారాయణ – భారతి దంపతులు (రావులపాలెం) రూ.లక్ష విరాళంగా ఇచ్చారు.



అన్నదానానికి రూ.1,01,116 విరాళం

రావులపాలెం: స్థానిక శిరిడీ సాయిబాబా అన్నదాన సత్రానికి గ్రామానికి చెందిన సత్తి అప్పారెడ్డి, మంగయమ్మ కుటుంబ సభ్యులు రూ.1,01,116 విరాళంగా అందజేశారు.

యాత్రికుల సేవలో రైల్ వన్



ప్రయాణికుల కోసం రైల్వే శాఖ అనేక సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చింది. ఆండ్రాయిడ్ ఫోన్ చేతిలో ఉంటే చాలు.. రైలు బోగీలోనే ప్రయాణికులకు వసతులన్నీ వచ్చి చేరేలా రైల్ వన్ యాప్‌ను రూపొందించింది. ఇప్పటి వరకూ అనేక యాప్‌లు ఉన్నప్పటికీ, అన్నింటినీ ఏకం చేసి ఒకే వేదికపైకి తీసుకొచ్చింది.

8లో

న్యూస్‌రీల్

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలోని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు డీఈవో కే.వాసుదేవరావు శుక్రవారం తెలిపారు. అన్ని యాజమాన్యాల ప్రభుత్వ, జిల్లాపరిషత్, మండల పరిషత్, ఎయిడెడ్, పురపాలక యాజమాన్యంలో గల ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేసే అన్ని కేటగిరీలకు చెందిన ఉపాధ్యాయులు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు తమ ప్రతిపాదనలు ఆన్‌లైన్‌లో సమర్పించాలన్నారు. ఈ నెల 13వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణకు గడువు ఉందన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శివకుమార్



సాక్షి, రాజమహేంద్రవరం: వైఎస్సార్ సీపీ తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గానికి చెందిన దాసరి శివకుమార్ నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం నియామక ఉత్తర్వులు వెలువరించింది. తనకు పదవి వరించేందుకు కృషిచేసిన పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణకు శివకుమార్ కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి పదవికి ఎంపిక చేసిన పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటానన్నారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

కీచకులపై చర్యలు తీసుకోండి



జమ్మలమడక నాగమణి

కాకినాడ రూరల్: రంగరాయ మెడికల్ కళాశాల విద్యార్థినులపై వేధింపులకు పాల్పడిన కీచకులపై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి డిమాండ్ చేశారు. ఆమె శుక్రవారం వీడియో ప్రకటన విడుదల చేశారు. మాట్లాడుతూ రాష్ట్రంలోనే పేరున్న రంగరాయ కళాశాలను కూడా కీచకులు వదలడం లేదని, పారా మెడికల్ విద్యార్థినుల పట్ల ల్యాబ్ అటెండెంట్, టెక్నీషియన్లు ప్రవర్తించిన తీరు అమానుషమని దీన్ని పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, దాడులు, హత్యలు, లైంగిక వేధింపులు ఎక్కువ అయ్యాయన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో 30 వేల మంది మహిళలు అదృశ్యమయ్యారని ఆరోపణలు చేసిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రంగరాయ ఘటనపై స్పందించాలని నాగమణి కోరారు.

తలుపులమ్మకు సారె సమర్పణ



తలుపులమ్మకు సారె తీసుకొస్తున్న మహిళా భక్తులు

తుని: తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. ఆషాఢమాసంలో మూడో శుక్రవారం కావడంతో పలు జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి అమ్మవారికి చీర, సారె సమర్పించారు. ఇళ్లల్లో స్వయంగా తయారు చేసిన పిండి వంటలతో నింపిన బిందెలను శిరస్సుపై ధరించి వస్తున్న భక్తులకు రాజగోపురం వద్ద ఆలయ ఈఓ విశ్వనాథరాజు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. మహిళలు అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. పండితులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఏర్పాట్లను కార్యనిర్వహణాధికారి విశ్వనాథరాజు పర్యవేక్షించారు.

14న జాబ్‌మేళా

కాకినాడ సిటీ: వికాస ఆధ్వర్యంలో ఈ నెల 14న వికాస కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు శుక్రవారం తెలిపారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమా, బీటెక్, ఎంబీఏ, ఎంకాం ఉత్తీర్ణులైన 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు.

ధర గెల వలేదు

- అరటి రేటు పతనంతో నష్టాలు
- మే నెలలో 10 టన్నుల లారీ రూ.2 లక్షలు.. నేడు రూ.90 వేలు
- ముందుకురాని వ్యాపారులు
- గతంలో 100 లారీల ఎగుమతి.. నేడు 40కి పరిమితం
- జిల్లాలో 7,500 హెక్టార్లలో సాగు
- 38 వేల మందికి ఉపాధి



ఖండవల్లి, ముక్కామలలో లారీలపై అరటి గెలలను ఎగుమతి చేస్తున్న కూలీలు

పెరవలి: మార్కెట్టులో అరటి ధరలు భారీగా పతనం అవ్వటంతో రైతులు గగ్గోలు పెడుతుండగా, వ్యాపారస్తులు నష్టాల ఊబిలో కూరుకుపోయారు. మే నెలలో 10 టన్నుల లారీ రూ.2 లక్షల ధర పలుకగా ప్రస్తుతం మార్కెట్టులో 10 టన్నుల లారీ రూ.90 వేలకు పడిపోవటంతో రైతులు, వ్యాపారస్తులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. నాడు జిల్లా నుంచి రోజూ 100 లారీలు ఎగుమతులు అయితే నేడు 30 నుంచి 40 లారీలే ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు అవుతున్నాయి. దీంతో రైతులు స్వచ్ఛందంగా పక్వానికి వచ్చిన అరటి గెలలను మార్కెట్టుకు తరలించి అయినకాడికి అమ్ముకుంటున్నారు.

6 వేల హెక్టార్లలోనే దిగుబడి

జిల్లాలో అన్ని రకాల అరటి 7,500 హెక్టార్లలో సాగు అవుతోంది. ముఖ్యంగా జిల్లాలో పెరవలి, నిడదవోలు, ఉండ్రాజవరం, నల్లజర్ల, చాగల్లు, కొవ్వూరు, దేవరపల్లి, గోపాలపురం, తాళ్ళపూడి, సీతానగరం, రాజానగరం, అనపర్తి మండలాల్లో ఈ సాగు ఎక్కువగా చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 6 వేల హెక్టార్లలో తోటలు దిగుబడి ఇస్తున్నాయి. కానీ ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు తగ్గటంతో స్థానిక మార్కెట్‌లో అమ్ముకునే దుస్థితి ఏర్పడటంతో ధరలు మరింత పతనం అవుతున్నాయి.

తోటలను వదిలేస్తున్న వ్యాపారస్తులు

అరటి మార్కెట్టులో జూన్ నెల నుంచి ధరలు పతనం అవుతూ వస్తున్నాయి. ప్రస్తుతం కర్పూర అరటి మార్కెట్టులో 10 టన్నుల లారీ రూ.90 వేలు పలకటంతో రైతులు, వ్యాపారస్తులు గగ్గోలు పెడుతున్నారు. చేల వద్దకు వ్యాపారస్తులు రాకపోవటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో అల్లాడిపోతున్నారు. ధర పతనంతో అరటి తోటలను కొనుగోలు చేసే వ్యాపారస్తులే కరవయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పక్వానికి వచ్చిన గెలలను కోయకపోతే పండిపోయి మొత్తం పంట పాడైపోతుందని దీనితో కొనే నాథుడే లేకుండా పోతారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చక్కెర కేళీ గెల ఒకటి రూ.250, ఎర్ర చక్కెర కేళీ గెల ఒకటి రూ.300 పలకటంతో వాటిని కొనుగోలు చేసిన వ్యాపారస్తులు తీవ్ర నష్టాలు పాలయ్యారు. ఎందుకంటే తోటలను కొనుగోలు చేసినప్పుడు చక్కెర కేళీ గెల ఒకటి రూ.250 నుంచి రూ.300 కొనుగోలు చేయగా, ఎర్ర చక్కెర కేళీ గెల ఒకటి రూ.300 నుంచి రూ.400కు కొనుగోలు చేశారు. కానీ మార్కెట్టులో కొనుగోలు చేసిన ధర లభించకపోవటంతో వ్యాపారస్తులు తోటలను వదిలివేస్తున్నారు. మార్కెట్టులో ధరలు పతనం అవ్వటంతో రైతులే మార్కెట్టుకు అరటి గెలలను సైకిళ్లు, మోటారు సైకిళ్లపై తరలించి అమ్ముకుంటున్నారు. మార్కెట్టులో సైకిల్‌లోడ్ (6 గెలలు) కర్పూర అయితే నాణ్యతను బట్టి రూ.1,000 నుంచి రూ.1,400లు, చక్కెర కేళీ రూ.1,500 నుంచి రూ.2000కు, ఎర్ర చక్కెర కేళీ రూ.2,000 నుంచి రూ.2,500 ధరలు పలుకుతున్నాయి.

తగ్గిన ఎగుమతులు

జిల్లాలో అరటి ఎగుమతులు నెల రోజులుగా తగ్గిపోయాయి. గతంలో ఇతర రాష్ట్రాలైన ఒడిశా, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, బిహార్ రాష్ట్రాలకు ప్రతి రోజూ 80నుంచి 100 లారీల సరకు ఎగుమతి అవ్వగా నేడు ఎగుమతులు 30 నుంచి 40 లారీలకు పడిపోయాయి. గతంలో బెంగాల్‌లో అరటి సాగు ఉండేది కాదు. నేడు అక్కడ ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు చేసే స్థాయికి సాగు రావటంతో ఎగుమతులు తగ్గాయి. ఒడిశాలో నెల రోజులుగా విపరీతమైన వర్షాలు కురవటంతో వినియోగం తగ్గి ఎగుమతులు మందగించాయి. తమిళనాడులో సరకు విపరీతంగా ఉండటంతో అక్కడికి ఎగుమతులు అంతంతమాత్రంగానే ఉన్నాయి. దీని ప్రభావంతో అరటి ధరలు పతనం అవుతున్నాయి.

ఉపాధికి విఘాతం

జిల్లాలో అరటి సాగుపై రైతులు 8వేల మంది **ఆధారపడితే** వీటిని నమ్ముకున్న **కూలీలు, వెదురు** వేసే కూలీలు, గెలలకు **అరటి ఆకులు చుట్టే** కూలీలు, అరటి గెల**లను కోసే కూలీలు**, అరటి వ్యాపారస్తులు **సుమారు 30 వేల** మంది ఉన్నారు. **మార్కెట్టులో ధరలు** తగ్గటం వలన వీరందరికి **ఉపాధి లేకపో**వటంతో వారి కుటుం**బాలు ఆర్థికంగా** ఇబ్బంది పడుతున్నాయి. **గత మేనెలలో అరటి** కోతకు వెళ్లిన కూలీ**లకు రోజుకి రూ.**500 నుంచి రూ.1,500 **వచ్చేదని నేడు** కూలి పనులు దొరకడం లేదని వాపోతున్నారు.

కొనే నాథుడు లేక..



గత ఏడాది కరోనా సమయంలో ఎగుమతులు లేక ఇబ్బందులు పడితే, నేడు కొనుగోలు చేసేవారు కరువవడంతో నానా పాట్లు పడుతున్నాం. తోటలు కొనే నాథుడు లేక సైకిళ్లు, మోటారు సైకిళ్లపై మార్కెట్టుకు తరలించి అయిన కాడికి అమ్ముకుంటున్నాం. **– యాతం మల్లికార్జునరావు,** అరటి రైతు, అన్నవరప్పాడు

గెలలు కోయటమే మానేశారు



తోటలు అమ్మినప్పుడు ధరలు బాగానే ఉన్నాయి. ఒక్కో గెల ధర రూ.250కి అమ్మాను. కానీ వ్యాపారస్తులు సగం తోట కోసిన తరువాత ధరలు పతనం అవ్వటంతో గెలలు కోయటమే మానేశారు. దీంతో నష్టాలు పాలవుతున్నాం. **– కావకా పాపారావు,** అరటి రైతు, కాకరపర్రు

రైతులకు తప్పని నష్టాలు



ఈ ఏడాది ప్రారంభంలో ధరలు బాగానే ఉన్నాయి. ఈ ఏడాది జూన్ నుంచి ధరలు తగ్గటంతో వ్యాపారస్తులు తోటలను అయిన కాడికి అడుగుతున్నారు. దీంతో ఈ సాగు చేస్తున్న రైతులు నష్టాల పాలవ్వక తప్పటం లేదు. **– సంఖు ప్రభాకరరావు,** అరటి రైతు, మల్లేశ్వరం

పెరుగుతున్న గోదావరి వరద

- అప్రమత్తమైన ఇరిగేషన్ యంత్రాంగం
- ఆదివారం నాటికి 8లక్షల క్యూసెక్కుల మిగులు జలాలు విడుదలయ్యే అవకాశం



కాటన్ బ్యారేజీ నుంచి విడుదల చేస్తున్న మిగులు జలాలు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ వద్ద వరద గోదావరి క్రమేపీ పెరుగుతుంది. శుక్రవారం సాయంత్రం కాటన్ బ్యారేజీ వద్ద 9.70 అడుగులకు నీటి మట్టం చేరింది. ఎగువ నుంచి వచ్చి చేరుతున్న నీటిని ఎప్పటికప్పుడు సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. బ్యారేజీ నుంచి 3,54,341క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి వదిలారు. ఎగువ గోదావరి పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో గోదావరి ఉపనది ప్రాణహిత పొంగి పొర్లుతోంది. దీంతో కాటన్ బ్యారేజీ వద్ద నీటి ఉధృతి శనివారం మరింత పెరిగే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. ఆదివారం సాయంత్రానికి ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద 8లక్షల క్యూసెక్కుల మిగులు జలాలు దాటి ప్రవహించే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో అప్రమత్తమైన ఇరిగేషన్ యంత్రాంగం ధవళేశ్వరం ఫ్లడ్ కంట్రోల్ రూమ్ నుంచి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తోంది. గోదావరి డెల్టా కాలువకు సంబంధించి 13,750 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 4,800, మధ్య డెల్టాకు 2,450, పశ్చిమ డెల్టాకు 6,500 క్యూసెక్కుల నీటిని వదిలారు. గోదావరి ఎగువ ప్రాంతాలకు సంబంధించి కాళేశ్వరంలో 11.79 మీటర్లు, పేరూరులో 15.42 మీటర్లు, దుమ్ముగూడెంలో 10.86 మీటర్లు, భద్రాచలంలో 37.20 అడుగులు, కూనవరంలో 13.60 మీటర్లు, కుంటలో 14.72 మీటర్లు, పోలవరంలో 9.01 మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి దగ్గర 13.88 మీటర్ల వద్ద నీటి మట్టాలు కొనసాగుతున్నాయి.

బీఎల్‌ఓలు బాధ్యతగా ఉండాలి

- ఓటర్ల జాబితా తయారీలో బీఎల్‌ఓ బాధ్యతాయుతంగా వ్యవహరించాలి
- జిల్లా కలెక్టర్, ఇన్‌చార్జ్ కమిషనర్ ప్రశాంతి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: ఓటర్ల జాబితా తయారీలో బీఎల్‌ఓలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్, ఇన్‌చార్జ్ కమిషనర్ పి.ప్రశాంతి సూచించారు. శుక్రవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో బూత్ లెవెల్ అధికారులకు నిర్వహించిన ట్రైనింగ్ కార్యక్రమంలో కలెక్టర్ ప్రసంగించారు. ఎన్నికల ప్రక్రియలో బీఎల్‌ఓల పాత్ర ఎంతో కీలకమన్నారు. శిక్షణ ద్వారా వారి పనితీరులో మెరుగుదలకు అవకాశం లభిస్తుందని కలెక్టర్ తెలిపారు. ఫారం–6, 6ఏ, 7, 8 ఓటర్ల జాబితా తయారీ, మార్పులు, చేర్పులు, మరణించినవారు, వలస వెళ్లిన వారి వివరాలను పరిశీలించి తుది సమాచారం ఏ విధంగా అందించాలో సూచించారు. విధి నిర్వహణలో బీఎల్‌ఓలు ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ముఖ్యంగా ఎన్నికలకు సంబంధించిన ప్రాథమిక అంశాలపైన పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. భారత రాజ్యాంగంలో గల అధికరణాల గురించి, ఎన్నికలకు సంబంధించిన ప్రజా ప్రాతినిధ్య చట్టం, ఎన్నికల నమోదు చట్టం, తదితర చట్టాలలోని ముఖ్యమైన సెక్షన్లు గూర్చి కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. బీఎల్‌ఓ పత్రికను ప్రతీ ఒక్కరూ తప్పక చదవాలన్నారు. అడిషనల్ కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, మేనేజర్ అబ్దుల్ మాలిక్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

మహిళలు, బాలికలపై దాడులు అరికట్టేందుకు ప్రణాళిక



నరసింహకిషోర్, జిల్లా ఎస్పీ

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో మహిళలు, బాలికలపై జరిగే దాడులు అరికట్టేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి, వారికి అన్ని విధాలా అండగా నిలుస్తున్నామని, శక్తి టీమ్‌ల ద్వారా అందుబాటులో ఉంటున్నామని ఎస్పీ డి.నరసింహకిషోర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మహిళల రక్షణ కోసం వుమెన్స్ హాస్టళ్లలో ప్రతిచోటా పాయింట్ బుక్స్ పెట్టి తరచుగా శక్తి టీమ్‌లు సందర్శిస్తున్నట్టు చెప్పారు. మహిళలు, బాలికల స్కూళ్లు, కాలేజీలు, హాస్టల్స్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, సరైన నడవడిక కలిగిన వార్డెన్లను ఏర్పాటు చేసేలా, యాజమాన్యాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. రాత్రి సమయాలలో అసాంఘిక శక్తులను అరికట్టేందుకు ఆరు స్పెషల్ టీంలను ఏర్పాటు చేశామన్నారు. విద్యాసంస్థల వద్ద ఉదయం, సాయంత్రం సమయాలలో ఈవ్ టీజింగ్ జరగకుండా శక్తి టీం, డ్రోన్లతో ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేశామన్నారు. పబ్లిక్ అండ్ పోలీస్‌తో సంయుక్తంగా జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో సమాచారాన్ని సులువుగా మార్పిడి చేసుకునే విధంగా సుమారు 100 వాట్సాప్ గ్రూపులను క్రియేట్ చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో బహిరంగ ప్రదేశాలు, గోదావరి నది పరీవాహక ప్రాంతాలు, పాడు పడిపోయిన ఇళ్లు, తోటలపై డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఆయా ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం సేవించడం, గంజాయి వినియోగం, పేకాట, ఈవ్ టీజింగ్, చైన్ స్నాచింగ్ నేరాలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నామని ఎస్పీ నరసింహకిషోర్ తెలిపారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 42 మహిళలు, చిన్నపిల్లల మిస్సింగు కేసులను గంటల వ్యవధిలోనే ఛేదించామని తెలిపారు.



పవన్‌కల్యాణ్... ఇప్పుడేం అంటారు?



ఘటన జరిగిన తీరును ఆసుపత్రి అధికారులను అడిగి తెలుసుకుంటున్న జక్కంపూడి విజయలక్ష్మి

కాకినాడ క్రైం: ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం ఉన్న జిల్లాలోనే పారామెడికల్ విద్యార్థినులపై లైంగిక వేధింపులు జరగడం అమానవీయమని వైఎస్సార్ సీపీ అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. గత ప్రభుత్వ హయాంలో కాకి లెక్కలు చూపి మహిళలపై ఘోరాలు జరిగిపోతున్నాయని మొసలి కన్నీరు కార్చిన పవన్ కల్యాణ్ ఇప్పుడేమంటారని నిలదీశారు. ఘటన నేపథ్యంలో శుక్రవారం ఆమె కాకినాడలోని జీజీహెచ్‌కు వచ్చారు. లైంగిక వేధింపులు చోటు చేసుకున్న ఏడవ నంబరు, అంబానీ ల్యాబ్‌లను పరిశీలించారు. అనంతరం లెక్చర్ గ్యాలరీ సమీపంలో ఉన్న హెచ్‌వోడీ రూంలో ఆసుపత్రి అధికారులతో సమావేశమయ్యారు. ఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని ల్యాబ్‌లు, వార్డుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడాన్ని తప్పుబట్టారు. పర్యవేక్షణ లోపం వల్లే ఇటువంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు ఈ ఘటనపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రి అధికారుల మాటలు పొంతన లేకుండా ఉన్నాయని, నిందితులకు నేర చరిత్ర ఉన్న విషయాన్ని దాస్తున్నారని ఆరోపించారు. శక్తి యాప్ ద్వారా ఉద్ధరించిందేంటని నారా లోకేష్‌ను నిలదీశారు. కూటమి ప్రభుత్వంలో ఉన్న వేలకొద్దీ దుర్యోధనులు, లక్షల కొద్దీ దుశ్శాసనులను శక్తి యాప్ ఏం చేయగలదని ప్రశ్నించారు. కీచకుల కొమ్ము కాస్తున్న కూటమి ప్రభుత్వం బెయిలబుల్ కేసులు పెడుతూ మహిళల భద్రతను ప్రశ్నార్థకం చేస్తోందన్నారు. విజయలక్ష్మి వెంట పార్టీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి రాగిరెడ్డి దీప్తి కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షురాలు మహిళా వర్దినీడి సుజాత, కాకినాడ సిటీ అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, సిటీ మహిళా అధ్యక్షురాలు పసుపులేటి వెంకటలక్ష్మి, కాకినాడ మాజీ మేయర్ సరోజ, మహిళా నేత భవానీ ప్రియ ఉన్నారు.

క్లుప్తంగా

అష్టదేవతల తీర్థయాత్ర స్పెషల్

రాజమహేంద్రవరం డిపో నుంచి ప్రారంభం



భక్తులతో బయలుదేరిన ప్రత్యేక బస్సు

రాజమహేంద్రవరం సిటీ: ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని రాజమహేంద్రవరం ఆర్టీసీ బస్సు డిపో నుంచి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అష్టదేవతల ఆలయాలు సందర్శనకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కె.మాధవ్ తెలిపారు. శుక్రవారం ఆర్టీసీ డిపో నుంచి 50 మంది భక్తులతో బయలుదేరిన ప్రత్యేక బస్సు అష్ట దేవతల ఆలయాల దర్శనం అనంతరం రాత్రి 8 గంటలకు డిపోకు చేరుకుంటుందన్నారు. ఒక్క రోజులో పూర్తయ్యే ఆ యాత్రలో కడియపులంక, చింతలూరు, మట్లపాలెం, కోవూరు వారాహిమాత, పిఠాపురం, తాటిపర్తి, పెద్దాపురం, కాండ్రకోట ఆలయాల దర్శనం అనంతరం తిరిగి రాజమహేంద్రవరం చేరుకుంటుందన్నారు. 18వ తేదీ శుక్రవారం మరికొన్ని ఆషాఢ మాసం అష్ట దేవతల బస్సులు నడిపేందుకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రత్యేక బస్సుల్లో టిక్కెట్లు అవసరమైన భక్తులు 95023 00189, 73829 12141 నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ అజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఓడలరేవు కేంద్రీయ విద్యాలయ భూసేకరణకు రూ.3.30 కోట్లు

అల్లవరం: మండలం ఓడలరేవు గ్రామంలో కేంద్రీయ విద్యాలయ నిర్మాణానికి 7.50 ఎకరాల భూసేకరణకు రూ.3.30 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఎంపీ గంటి హరీష్ బాలయోగి తెలిపారు. ఎన్నో ఏళ్లుగా కోనసీమ వాసులు ఎదురుచూస్తున్న కేంద్రీయ విద్యాలయ కల సాకారం అవుతోందని తెలిపారు. మన ప్రాంతంలోని మత్స్యకార కుటుంబాలు, వ్యవసాయ కార్మికులు తదితర రంగాలలో పనిచేస్తున్న ఉద్యోగుల పిల్లలకు స్థానికంగా ఉన్నతమైన సీబీఎస్ఈ విద్యను అందించే అవకాశం కల్పిస్తుందని హరీష్ అన్నారు.

మహిళపై బ్లేడుతో దాడి

కాకినాడ క్రైం: కాకినాడ జగన్నాథపురానికి చెందిన గౌస్ మొహిద్దీన్ అనే వ్యక్తి కొన్నేళ్లుగా ఓ మహిళతో సహజీవనం చేస్తున్నాడు. అతడి ప్రవర్తన నచ్చక ఆమె అతడికి దూరంగా ఉండగా కక్ష పెంచుకున్న మొహిద్దీన్ శుక్రవారం సాయంత్రం జగన్నాథపురం సమీపంలో ఉన్న జమ్మి చెట్టు వద్ద ఆమెపై బ్లేడుతో దాడికి పాల్పడి ముఖంపై లోతైన గాయాలు చేశాడు. రక్తమోడుతున్న బాధితురాలు కాకినాడ జీజీహెచ్‌లో చేరింది. కాకినాడ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

యాత్రికుల సేవలో రైల్ వన్

- అందుబాటులోకి కొత్త యాప్
- అనేక సౌకర్యాలతో రూపకల్పన
- కొత్త ఫీచర్ల చేరికతో మరిన్ని సేవలు

రాజమహేంద్రవరం సిటీ: ప్రయాణికుల కోసం రైల్వే శాఖ అనేక సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చింది. ఆండ్రాయిడ్ ఫోన్ చేతిలో ఉంటే చాలు.. రైలు బోగీలోనే ప్రయాణికులకు వసతులన్నీ వచ్చి చేరేలా రైల్ వన్ యాప్‌ను రూపొందించింది. ఇప్పటి వరకూ అనేక యాప్‌లు ఉన్నప్పటికీ, అన్నింటినీ ఏకం చేసి ఒకే వేదికపైకి తీసుకొచ్చింది. ఈ యాప్‌లో ఐఆర్‌సీటీసీ సహా, భారతీయ రైల్వే అందించే దాదాపు అన్ని ప్రధాన సేవలు ఒకేచోట లభిస్తాయి. ఆండ్రాయిడ్, ఐఓఎస్ ప్లాట్‌ఫారంల్లో లభ్యమయ్యే ఈ యాప్ ద్వారా టికెట్ బుకింగ్, పీఎన్‌ఆర్ సమాచారం, సీటు లభ్యత, ఫుడ్ ఆర్డర్ వంటి అనేక సేవలను పొందే అవకాశం ఉంది.

మరిన్ని సేవలు

మోర్ ఆఫరింగ్స్ విభాగంలో ప్రయాణికులు జర్నీ కోసం ముందుగానే భోజనాన్ని ఆర్డర్ చేసుకోవచ్చు. పీఎన్‌ఆర్ స్థితినీ చెక్ చేసుకోవచ్చు. కోచ్ స్థానాలను తెలుసుకోవచ్చు. రైల్వే సేవలపై ఫిర్యాదు చేయాలనుకునే వారు రైల్ మదద్ ఆప్షన్ ఎంచుకోవచ్చు. ఈ ఫీచర్ ద్వారా పలు సమస్యలను నివేదించవచ్చు. ప్రధాన స్టేషన్లలోని అనేక రెస్టారెంట్లలో ఫుడ్ డెలివరీ బుక్ చేసుకునేందుకు పీఎన్‌ఆర్ నంబరును నమోదు చేసి, ఇష్టమైన ఆహారాన్ని ఆర్డర్ చేసుకోవచ్చు.



ప్రయాణికులతో రద్దీగా ఉన్న రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్

యూజర్ల సౌలభ్యం కోసం..


ఈ యాప్‌లో యూజర్ ఇంటర్‌ఫేస్ సులభంగా ఉంటుంది. హోమ్ పేజీలో వినియోగదారులు రిజిస్టర్ చేసుకున్న తర్వాత, వారి పేరు కనిపిస్తుంది. దాని కింద అన్ని సేవలను సూచించే చిహ్నాలుంటాయి. ఈ విభాగంలో ప్రయాణికులు రిజర్వ్‌డ్, అన్ రిజర్వ్‌డ్, ప్లాట్‌ఫాం టికెట్‌నూ బుక్ చేసుకోవచ్చు. వినియోగదారులు తాము కోరుకునే టికెట్‌ను ఎంచుకుని, వివరాలను నమోదు చేసి, టికెట్లను పొందవచ్చు.

టికెట్ బుక్ చేసుకోండిలా..

- ముందుగా రైల్వే వన్ యాప్‌ను ఓపెన్ చేయాలి.
- హోమ్ పేజీలో రిజర్వ్ టికెట్ విభాగంపై క్లిక్ చేయాలి.
- ప్రయాణ వివరాలు, గమ్యస్థానం, తేదీని నమోదు చేయాలి.
- అమౌంట్ పే చేసి, బుకింగ్‌ను ధ్రువీకరించుకోవాలి.

పీఎన్‌ఆర్ తెలుసుకునేదిలా..

- హోమ్ పేజీలో మోర్ ఆఫరింగ్స్ కింద ఉన్న పీఎన్‌ఆర్ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి.
- పీఎన్‌ఆర్ నంబర్ నమోదు చేసి, బుకింగ్ వివరాలు తెలుసుకోవచ్చు.
- రైలు సమాచారం, ప్రయాణ తేదీ, సీటు స్థితి, రాబోయే స్టేషన్లు, తదుపరి స్టాప్ వంటి వివరాలను తెలుసుకోవచ్చు.



రైల్వే వన్ యాప్ సింబల్

రైల్ మదద్‌లో ఫిర్యాదు


వీడియో, చిత్రం, ఆడియో ఉపయోగించి సమస్యపై ఫిర్యాదు చేయవచ్చు. ఏ రైలులో, ఏ రైల్వే స్టేషన్‌లో సహాయం కావాలనే విషయాన్ని స్పష్టంగా ధ్రువీకరించాలి. సమస్యను స్పష్టంగా వివరించి, ఫిర్యాదును సమర్పించాలి.

అద్భుతమైన విధానం



ఇప్పటివరకు రైలు ప్రయాణం కోసం టికెట్ల రిజర్వేషన్ కోసం రైలు ఎక్కడుందో తెలుసు కోవడం కోసం పలు యాప్‌లలో వెతకాల్సి ఉండేది. నూతనంగా భారతీయ రైల్వే ప్రవేశపెట్టిన రైల్వే వన్ యాప్ ద్వారా ఒకే వేదికపైకి తీసుకువచ్చారు. ఈ విధమైన యాప్ రావడం ప్రయాణానికి ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. ఈ యాప్ ద్వారా ప్రయాణీకులకు సౌకర్యమంతమైన, సులభతరమైన ప్రయాణం అందుబాటులోకి వస్తుంది.

– జతిన్‌కుమార్ షెలత్, రాజమహేంద్రవరం



ఆండ్రాయిడ్ ఫోన్‌లో యాప్ వివరాలు

యాప్‌తో ఎంతో ఉపయోగం



రైలు ప్రయాణం సౌకర్యంగా ఉండేందుకు రైల్వే వన్ యాప్ ఎంతో ఉపయోగపడుతుంది. అన్ని సౌకర్యాలు ఒకే చోట చేర్చి రూపొందించి ప్రజలకు అందుబాటులో తీసుకురావడం హర్షణీయం. భవిష్యత్తులో మరిన్ని మెరుగులు దిద్ది మరింత సౌకర్యవంతంగా ఉంటుందని అనుకుంటున్నాను.

– ఆకెళ్ల శ్రీకాంత్, రాజమహేంద్రవరం

భక్తుల సౌకర్యాలే లక్ష్యంగా పనిచేస్తున్నాం

- భక్తుల సూచనలు పాటించి సమస్యలు పరిష్కరిస్తాం
- డయల్ యువర్ ఈవోలో డీసీ అండ్ ఈఓ చక్రధరరావు



వాడపల్లిలో డయల్ యువర్ ఈఓ నిర్వహిస్తున్న డీసీ అండ్ ఈఓ చక్రధరరావు

కొత్తపేట: వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కలిగేలా భక్తుల సూచనలు పాటిస్తూ, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు దేవదాయ, ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. భక్తుల సూచనలు, సలహాలు తీసుకునేందుకు, వారి సమస్యలు తెలుసుకునేందుకు శుక్రవారం ×డయల్ యువర్ ఈవో¶ నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన సుమారు 40 ఫోన్ కాల్స్‌లో కొందరు భక్తులు ఆలయంలో వసతులపై సంతృప్తి వ్యక్తం చేయగా మరి కొందరు అసంతృప్తి వ్యక్తం చేస్తూ పలు సూచనలిచ్చారు. హైదరాబాద్, తాడేపల్లిగూడెం నుంచి ఫోన్ చేసిన భక్తులు పార్కింగ్ సమస్యలను, శనివారం రోజు వచ్చే భక్తులకు అరిటాకులో భోజనం పెట్టాలని కోరారు. దీనికి డీసీ స్పందిస్తూ ప్రతి శనివారం 20 వేల నుంచి 25 వేల మందికి ప్లేట్లలో అన్నప్రసాదం అందిస్తున్నామని, వకుళమాత అన్నదాన భవన నిర్మాణం పూర్తి కాగానే టేబుళ్ల ఏర్పాటు చేసి ఒకేసారి 3,500 మందికి వడ్డించేలా చర్యలు తీసుకుంటున్నామని, అప్పుడు అరటి ఆకులో భోజనం పెడతామని పేర్కొన్నారు. వచ్చే ప్రతి భక్తుడు స్వామివారిని కనులారా దర్శించి, సంతృప్తి చెందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దానిలో భాగంగా ఫ్లైఓవర్ ఏర్పాటు, క్యూలైన్లో తాగునీరు సదుపాయం, చిన్నపిల్లలకు బిస్కెట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ఆలయం లోపల సెక్యూరిటీ సిబ్బందిని పెంచడంపై భక్తుల సలహాను పాటిస్తామన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

రాజోలు: అనుమానాస్పద స్థితిలో రాజోలు సుందరమ్మ చెరువు గట్టు ప్రాంతానికి చెందిన దీపాటి మణిరావు (38) శుక్రవారం మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య దీపాటి స్వర్ణలత ఫిర్యాదు మేరకు ఎస్సై రాజేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ నెల పదో తేదీన తాపీ పనికి వెళ్లి రాత్రి ఇంటికి తిరిగి వచ్చి శుక్రవారం ఉదయం ఇంటి బయట విగతజీవిగా కనిపించాడు. మృతుడి స్వస్థలం మలికిపురం మండలం లక్కవరం. ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లి ఏడాది క్రితం భారత దేశానికి వచ్చిన మణిరావు అత్త వారి ఇంటి వద్ద రాజోలులో ఉంటున్నాడు. అప్పుడప్పుడు తన తల్లిని చూసేందుకు లక్కవరం వెళ్తూ ఉండేవాడు. అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన మణిరావు మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

14న ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళా

రాజమహేంద్రవరం రూరల్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గల ప్రముఖ కంపెనీలు వివిధ ట్రేడులలో ట్రేడు అప్రెంటిస్ ఖాళీలను భర్తీ చేసేందుకు రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 14వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ప్రధానమంత్రి అప్రెంటిస్ మేళా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ అప్రెంటీస్ మేళాలో 250 ఖాళీలు పూర్తి చేయనున్నారని, 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. కాబట్టి ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులు ఒక జత ధ్రువపత్రాలతో హాజరు కావాలన్నారు. ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఐబీఎం పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. లేకుంటే ఈనెల 14వ తేదీ ఉదయం 8 గంటలకు ప్రభుత్వ ఐటీఐ కార్యాలయంలో నిర్వహించే మేళాకు అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో హాజరై రిజిస్ట్రేషన్ చేయించుకుని అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని తెలిపారు. అప్రెంటిస్ మేళాకు హాజరయ్యే విద్యార్థులు http://dft.gov.in/appmelaapril22 రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ సునీల్‌కుమార్ తెలిపారు.

నన్నయ వీసీకి నెల్సన్ మండేలా ఇన్‌స్పైర్ అవార్డు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీకి నెల్సన్ మండేలా ఇన్‌స్పైర్ అవార్డు 2025 లభించింది. నెల్సన్ మండేలా ఆశయాలకు అనుగుణంగా సానుకూల మార్పు, స్ఫూర్తిదాయక విధానాలు, ధైర్యవంతమైన చర్యలకు గుర్తింపుగా ఈ అవార్డుకు ఎంపిక చేసినట్టుగా పీపుల్ ఇండియా వరల్డ్ ఆర్గనైజేషన్ పేర్కొంది. భాషా శాస్త్రం, విద్యారంగాలలో అందించిన సేవలు, అందుకున్న జాతీయ, అంతర్జాతీయ ప్రశంసలతో పాటు 19 గిరిజన భాషలకు లిపిని అభివృద్ధి చేయడంలో ఆమె కీలక పాత్ర వహించారు. 2022లో భారత ప్రభుత్వం నుంచి నారీ శక్తి పురస్కారాన్ని, 2024లో అక్షరమాల ప్రాజెక్టు నుంచి అవార్డును అందుకున్నారు.



ఆచార్య ప్రసన్నశ్రీ అందుకున్న పురస్కారం

ట్రేడ్ లైసెన్స్ పేరిట వ్యాపారికి బురిడీ

- మున్సిపల్ కమిషనర్ పేరుతో ఫోన్‌కాల్
- ఫోన్ పే ద్వారా రూ.3,500 చెల్లింపు

అమలాపురం టౌన్: స్థానిక మున్సిపల్ కమిషనర్ వి.ప్రశాంత్ కుమార్ పేరుతో ఓ అగంతకుడు పట్టణంలోని ప్రసాద్ అనే వ్యాపారికి ఫోన్ చేసి బెదిరించడం చర్చనీయాంశమైంది. అగంతకుడు ప్రసాద్‌కు ఫోన్ చేసి ట్రేడ్ లైసెన్స్ కట్టాలని, సీవో మేడమ్ రూ.19 వేలు జరిమానా విధిస్తూ ఇచ్చిన డిమాండ్ నోటీసు పంపారని, అది అందిందీ లేనిదీ చెప్పాలని కమిషనర్‌గా నమ్మించే ప్రయత్నం చేశాడు. చివరకు వాట్సాప్‌లో హాయ్ అని పెట్టండి చెప్పడం, ఆ వ్యాపారి పెట్టడం, తర్వాత రూ.3,500 ఫోన్ పే చేయడం చకా చకా జరిగిపోయాయి. ఇంతలో వ్యాపారికి అనుమానం వచ్చి కమిషనర్ నిర్మల్ కుమార్‌కు ఫోన్ చేస్తే అది ఫేక్ కాల్ అని, తాను ఫోన్ చేయలేదని చెప్పడంతో తాను మోసపోయినట్లు గమనించాడు. ఈ సమాచారంతో కమిషనర్ పట్టణ సీఐ పి.వీరబాబుకు ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పి విచారణ జరిపించాలని కోరారు.

వేధింపులపై వెంటనే చర్యలు ఉండాలి

కాకినాడ సిటీ: లైంగిక వేధింపులపై వచ్చే ఫిర్యాదులపై విద్యాసంస్థలు, పోలీస్ స్టేషన్ల సిబ్బంది తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని ఐద్వా డిమాండ్ చేసింది. కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల పారా మెడికల్ విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ రమణి, ఐద్వా జిల్లా కార్యదర్శి వరలక్ష్మి, కాకినాడ అధ్యక్ష, కార్యదర్శులు భూలక్ష్మి, కె.నాగజ్యోతి శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పారా మెడికల్ విద్యార్థినులపై చాలా కాలంగా లైంగిక వేధింపులకు పాల్పడుతూ వారి ఫొటోలు తీసి బెదిరింపులకు గురి చేస్తున్న వారిపై బాధితులు ధైర్యంగా ఫిర్యాదు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇదే విధంగా విద్యార్థినులు ధైర్యంగా వెంటనే ఫిర్యాదు చేయాలని, లేకపోతే మరింత ప్రమాదానికి గురవుతారన్నారు. అధికారులు తక్షణమే చర్యలు చేపట్టకుండా కాలయాపన చేస్తే జరగాల్సిన నష్టం జరిగిపోతుందన్నారు. ఎన్ని చట్టాలు వచ్చినా మహిళలపై అత్యాచారాలు, వేధింపులు పెరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణ చర్యలకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలని, లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు వేయాలని కోరారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	23,000 – 23,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	26,500
గటగట (వెయ్యి)	25,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	25,500
గటగట (వెయ్యి)	24,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	19,000 – 20,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	19,000 – 20,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



విద్యుదాఘాతంతో మృతి చెందిన రాజేష్

దేవరపల్లి: మండలంలోని గొల్లగూడెంలో విద్యుదాఘాతానికి గురై యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం మేరకు గోపాలపురం మండలం వేళ్లచింతలగూడేనికి చెందిన మందపాటి రాజేష్ (24) గోపాలపురంలోని కేబుల్ ఆపరేటర్ శ్రీధర్ రెడ్డి వద్ద పార్ట్ టైమ్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం దేవరపల్లి మండలం గొల్లగూడెంలో విద్యుత్ స్తంభం ఎక్కి కేబుల్ వైరు కడుతుండగా, పై భాగంలో ఉన్న 11 కేవీ హైటెన్షన్ లైన్ తీగలు తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం గోపాలపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు రాజేష్ అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతుడి తండ్రి చంటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వి.సుబ్రహమణ్యం తెలిపారు.

రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి



రైలు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి

తుని: రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. నర్సీపట్నంరోడ్డు రైల్వేస్టేషన్ యార్డు ప్రాంతంలో సుమారు 40 ఏళ్ల వ్యక్తి రైలుపట్టాలు దాటుతుంటుండగా రాజమహేంద్రవరం నుంచి విశాఖపట్నం వెళ్లే రైలు ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు నలుపురంగు షార్ట్ ధరించి, ఎడమ చేతిపై మిర్నో (ఎంఐఆర్ఎస్ఓ) అను పచ్చబొట్టు ఉంది. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 94906 19020 నంబరును సంప్రదించాలన్నారు.

కండక్టర్ కుటుంబానికి రూ.1.08 కోట్ల పరిహారం



కండక్టర్ భార్యకు చెక్కు అందిస్తున్న ఆర్టీసీ జోన్–2 ఈడీ విజయరత్నం

రాజోలు: గత ఏడాది ఊడిమూడి శివారులో ధాన్యం ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్సు ఢీ కొన్న ప్రమాదంలో మృతి చెందిన కండక్టర్ కేఎస్ రావు కుటుంబానికి ఆర్టీసీ జోన్–2 ఈడీ విజయరత్నం రూ.1.08 కోట్లు చెక్కును శుక్రవారం అందజేశారు. కండక్టర్ భార్య కె.గంగాభవానికి ఈ చెక్కును అధికారులు అందజేశారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్స్ పబ్లిక్ లయబిలిటీ ఫండ్ (ఈడీపీఎల్ఈ) ద్వారా ఈ పరిహారం వచ్చింది. ఆర్టీసీ ఉద్యోగులకు సంస్థ అండగా నిలుస్తుందని ఈడీ అన్నారు. డీపీటీఓ ఎస్‌పీపీ రాఘవకుమార్, డిపో మేనేజర్ పి.ధనమ్మ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పులస @ రూ.15వేలు

యానాం: గోదావరికి వరద ఉధృతి పెరుగుతుండటంతో మత్స్యకారుల వలలకు పులసలు చిక్కుతున్నాయి. శుక్రవారం యానాం గౌతమీగోదావరి పాయలో తొలిసారిగా పులస చేప వలకు చిక్కింది.

దీంతో స్థానిక పుష్కరఘాట్ వద్ద పులస చేపను వేలం వేయగా స్థానిక మత్స్యకారమహిళ పొన్నమండ రత్నం రూ.15 వేలకు చేపను దక్కించుకుంది. గోదావరికి ఎర్రనీరు రావడంతో అరుదైన గోదావరి పులస పడటంతో మిగిలిన ఆగస్టు, సెప్టెంబర్ నెలల వరకు పులసలు పడతాయని మత్స్యకారులు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.



పులస చేపను వేలంలో దక్కించుకున్న పొన్నమండ

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

గండేపల్లి: గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలియజేశారు. ఆయన తెలిపిన మేరకు కిర్లంపూడి గ్రామానికి చెందిన టి.రాజశేఖర్ వద్ద రెండు కేజీల గంజాయి లభ్యం అయిందని గండేపల్లి ఎస్సై యూవీ శివనాగబాబు, డిప్యూటీ తహసీల్దార్ సమక్షంలో అరెస్ట్ చేసి పెద్దాపురం కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించగా రిమాండ్ నిమిత్తం ముద్దాయిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్‌కు తరలించినట్లు తెలిపారు.



రెవెన్యూ అధికారి సమక్షంలో అరెస్టు చేసిన ఎస్సై

విశ్రాంత జీవుల భూముల ఆక్రమణ

- ముగ్గురి నిందితుల అరెస్ట్
- ప్రభుత్వ అడంగల్ పుస్తకాలు స్వాధీనం

మధురవాడ: తమ తాత, ముత్తాతల ఆస్తి అని.. అడంగల్, ఎఫ్ఎంబీల్లో వారి పేర్లు ఉన్నాయని నమ్మించారు. జీపీఏ చేయించి సేల్ డీడ్ చేయించారు. ఇలా ఐదుగురు విశ్రాంత ఉద్యోగుల భూమిని ఆక్రమించిన ముగ్గురు వ్యక్తులను పీఎంపాలెం పోలీసులు అరెస్టు చేశారు. నార్త్ జోన్ ఏసీపీ అప్పలరాజు శుక్రవారం తెలిపిన వివరాల మేరకు 1983లో మధురవాడ రెవెన్యూ గ్రామం సర్వే నంబర్ 203 పార్ట్ రేవళ్లపాలెంలోని బ్యాంక్ ఆఫీసర్స్ హౌసింగ్ లే అవుట్‌లో కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన ఆర్ఎస్ఎస్ ప్రకాశరావు, మరికొందరు 300 గజాల చొప్పున ప్లాట్లు కొనుగోలు చేశారు. ఇందులో కొందరు మరణించగా మరికొందరి వారసులు దేశ, విదేశాల్లో ఉన్నారు. దీన్నే అదనుగా భావించి మధురవాడ రేవళ్లపాలేనికి చెందిన బెవర అనిల్‌కుమార్, అతని అన్న వెంకటేష్, శ్రీకాకుళం జిల్లా లక్ష్మీపురానికి చెందిన పగోటి దిలీప్‌కుమార్ మరికొందరితో కలిసి.. రేవళ్లపాలెం పరిసర ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న భూములకు తప్పుడు డాక్యుమెంట్‌లు సృష్టించి అక్రమంగా విక్రయిస్తున్నారు. ఇదే విధంగా అనిల్, దిలీప్ కుమార్ ఫిర్యాదుదారు ప్రకాశరావు ఆస్తిని కాకినాడకు చెందిన రామ పద్మజకు విక్రయించారు. అలాగే గత నెల 28న రేవళ్లపాలెం శ్రీనివాస స్కూల్ సమీపంలోని భూమిలోకి అర్ధరాత్రి కొందరి సాయంతో పొక్లెయిన్, లారీలతో చొరబడి ఫెన్సింగ్ వేయడానికి ప్రయత్నించారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఫిర్యాదిదారు అక్కడకు చేరుకుని ఆపే ప్రయత్నం చేయగా.. అతన్ని భయభ్రాంతులకు గురిచేశారు. ఇక్కడ సుమారు ఐదు ప్లాట్‌లకు చెందిన 1,500 గజాల భూమిని ఆక్రమించడానికి ప్రయత్నం చేయడంతో బాధితులు పీఎంపాలెం పోలీసులను ఆశ్రయించారు. విచారణ ప్రారంభించిన సీఐ బాలకృష్ణ, ఎస్ఐ డి.రాము అక్రమార్కులు నకిలీ పత్రాలతో కె. కోటపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తప్పుడు జీపీఏ పొంది దాని ద్వారా ఇతరులకు సేల్ డీడ్ చేసినట్టు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. వీరు 2019, 2025లో కూడా ఇలానే ప్రైవేట్ స్థలాలను విక్రయించినట్లు విచారణలో తేలింది. ఈ మేరకు నిందితులు అనిల్ కుమార్, వెంకటేష్, దిలీప్ కుమార్‌లను అదుపులోకి తీసుకుని, రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి మధురవాడ పరిసర ప్రాంతాలకు చెందిన అడంగల్, ఎఫ్ఎంబీ పుస్తకాలను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. ఈ వ్యవహారంలో ఇంకా ఎంత మంది ఉన్నారనే విషయంపై సమగ్ర విచారణ చేస్తున్నట్లు వివరించారు.